# ప్లీజ్.. పార్టీ మారొద్దు..!

## 'కమలం'లో రాజీనామాల కలకలం

- నాయకులు, కార్యకర్తలను బుజ్జగిస్తున్న పెద్దలు
- గ్రేటర్‌లో కార్పొరేటర్లు, ఆశావహులతో మంతనాలు జరుపుతున్న అధిష్ఠానం
- ఓ వైపు ప్రధానితో సహా కేంద్ర మంత్రుల ప్రచారం
- మరోవైపు కాషాయం ఖాళీ అయ్యే దుస్థితి
- ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన అంబర్‌పేట, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ దంపతులు
- వీరి దారినే ఎంచుకుంటున్న అసంతృప్తులు
- అయోమయంలో కాషాయం పెద్దలు



మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ అధికార ప్రతినిధి తోకల సుధాకర్‌రెడ్డికి బీఆర్‌ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : కమలంలో రాజీనామాల పర్వం కొనసాగుతున్నది. దీంతో రాష్ట్ర కాషాయ పెద్దల్లో వణుకుపుడుతున్నది. ఓ వైపు తెలంగాణలో ప్రధానితో సహా కేంద్ర మంత్రులు ఎన్నికల ప్రచారానికి వస్తుండటం.. మరోవైపు గ్రేటర్ బీజేపీ నాయకులంతా పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరుతుండటంతో కాషాయం ఖాళీ అయ్యే దుస్థితి ఏర్పడింది. దీంతో బెదిరిపోయిన రాష్ట్ర అధినాయకత్వం బుజ్జగింపుల ప్రక్రియ చేపట్టింది. ఎన్నికల ప్రచార పనుల్లో ఎవరికి వారు బిజీగా ఉన్న నాయకులంతా హుటాహుటినా నాంపల్లి రాష్ట్ర కార్యాలయంలో కార్పొరేటర్లు, ఆశావహులు, నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే త్వరలో జరిగే బీసీ గర్జన సభ కోసం సమావేశమని చెప్పినప్పటికీ అధిక భాగం పార్టీ ఫిరాయింపులపైనే చర్చలు జరిగాయి. గ్రేటర్‌లో మొన్న అంబర్‌పేట కార్పొరేటర్ పద్మ దంపతులు, నిన్న హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మిరామన్ గౌడ్ దంపతులు బీఆర్‌ఎస్‌లోకి వచ్చిన విషయం తెలిసిందే. వీళ్ల దారిలోనే మరి కొంతమంది కార్పొరేటర్లు, టికెట్ ఆశించి భంగపడ్డ ఆశావహులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లడానికి అంతా సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. జూబ్లీహిల్స్, ముషీరాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, నాంపల్లి, మల్కాజిగిరి, కంటోన్మెంట్ నియోజకవర్గాల నుంచి భారీగా బీజేపీ నాయకుల వలసలు బీఆర్‌ఎస్‌లోకి ఉండబోతున్నాయి. ఈ పరిస్థితుల్లో బీజేపీ అధిష్ఠానం అసంతృప్తులతో మంతనాలు జరుపుతున్నారు. పార్టీ మారొద్దని బతిమిలాడుకునే పరిస్థితి వచ్చిందంటూ ఓ సీనియర్ నాయకుడు చెప్పాడు. ఇదే సమావేశంలో ఓ కార్పొరేటర్ పార్టీ పరిస్థితి నియోజకవర్గంలో బాగలేదని, ఓటమి ఖాయంగా కనిపిస్తుందని తన మనసులో మాట చెప్పినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ అభిప్రాయాలే అక్కడున్న అధిక శాతం మంది వ్యక్తం చేయడంతో అలాంటి పరిస్థితి ఏమీ ఉండదని హై కమాండ్ నాయకులు వారించే ప్రయత్నం చేశారు. పార్టీలోనే ఉండండని నచ్చజెప్పారు. కోరుకున్నట్టుగానే అందరికి న్యాయం చేస్తామని హామీచ్చినట్టు తెలిసింది. కాగా, సమావేశం జరుగుతుండగానే గ్రేటర్‌లోని పలు నియోజకవర్గాల నుంచి అసంతృప్తులు పార్టీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగడం విశేషం.

### అయ్యో.. కిషనయ్య..

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు నడ్డా తదితరులంతా తెలంగాణ ఎన్నికల ప్రచారంలో కీలకంగా వ్యవహరిస్తుంటే పార్టీకి ఊపు రావాల్సింది పోయి ఉన్న నాయకులు, క్యాడర్ పార్టీ విడిచి వెళ్లడం ఇప్పుడు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పుండు మీద కారం చల్లినట్టుగా మారింది. ఇప్పటికే టికెట్ రాని వారిని బుజ్జగించే పనిలో ఉన్న కిషన్‌రెడ్డి ఇప్పుడు ద్వితీయ శ్రేణి నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పార్టీ వీడి బీఆర్‌ఎస్‌లో చేరుతుండటం ఆయనకు గుబులు పుట్టిస్తున్నది. ఓ వైపు సీఎం కేసీఆర్‌పై మీడియా సమావేశాల్లో విమర్శలు చేస్తుంటే అదే పార్టీ నాయకులు మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతుండటం విశేషం. రాష్ట్ర బీజేపీ నాయకుడి మాటలు వినే పరిస్థితి కూడా లేకపోవడంతో కిషన్‌రెడ్డి మరో ప్రయ్నతంగా ఒక్కొక్కరితో రహస్య మంతనాలు ఏర్పాటు చేసి వారి డిమాండ్లను పరిష్కరించే పనిలో ఉన్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

## మతోన్మాద శక్తులను ప్రజలు విశ్వసించరు

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 4 : మతోన్మాద శక్తులను, దాడులకు పాల్పడే నాయకులను ప్రజలు ఎప్పుడు విశ్వసించరని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. ప్రజల్లో ఉండే నాయకుడినే ప్రజలు కోరుకుంటారు తప్ప అహంకారంతో కండ్లునెత్తికెక్కిన వారిని కాదన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి తోకల సుధాకర్‌రెడ్డి, మహిళా నాయకురాలు శరణమ్మలు వారి అనుచరులతో శనివారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. అభివృద్ధి చేసే వారు ఎవరో, అబద్ధపు మాటలు చెప్పే వారు ఎవరో ప్రజలకు పూర్తిగా తెలుసు అని అన్నారు. ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధి బీజేపీ నాయకులకు కూడా తెలుసు అని, అందుకే తనకు మద్దతు తెలిపేందుకు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌లో చేరిన తోకల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికార దాహంతో బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ఒంటెద్దు పోకడలు భరించలేకపోతున్నామన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆగడాలను భరించలేకే పార్టీ వీడుతున్నామన్నారు. ప్రజలకు మెరుగైన సంక్షేమాలు, అభివృద్ధి కావాలంటే బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గ్రేటర్ కాంగ్రెస్‌లో విచిత్ర పరిస్థితి

- అభ్యర్థులను ప్రకటించినా వెనక్కి తగ్గని అసంతృప్తిపరులు
- మహేశ్వరం బరిలో కేఎల్‌ఆర్‌ను నిలిపిన అధిష్ఠానం
- బీ- ఫాం నాదేనంటూ నామినేషన్ దాఖలు చేసిన పారిజాత
- ఢిల్లీలోనే మకాం వేసిన చిగురింత పారిజాత నరసింహారెడ్డి దంపతులు
- అయోమయంలో కాంగ్రెస్ పార్టీ క్యాడర్

సిటీబ్యూరో, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సమరంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు దూసుకుపోతుంటే.. కాంగ్రెస్ పార్టీలో మాత్రం విచిత్ర పరిస్థితి నెలకొన్నది. మొన్నటి దాకా అభ్యర్థుల ఎంపిక తలనొప్పిగా మారితే.. ఇప్పుడు రెబల్ బెడద ఆ పార్టీని వెంటాడుతున్నది. ముఖ్యంగా నామినేషన్ల పర్వం ఊపందుకుంటున్న వేళ కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఆశించి భంగపడిన నేతలంతా పట్టువీడడంలేదు. అభ్యర్థిని లెక్క చేయకుండా నామినేషన్ వేసి సవాల్ విసురుతున్నారు. కుక్కలు చింపిన విస్తరిలా కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మారింది. అనడానికి మహేశ్వరం నియోజకవర్గంలో జరుగుతున్న వ్యవహారమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. మొదట్నుంచి మహేశ్వరం నియోజకవర్గం టికెట్ నాదేనంటూ బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత నరసింహారెడ్డి ప్రచారం చేసుకుంటూ వచ్చారు. ఈ సమయంలోనే ఎమ్మెల్యే టికెట్ కోసం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి కోట్లలో డబ్బులు ముట్టజెప్పానంటూ ప్రకటన ప్రకంపనలు సృష్టించాయి. సీటుకు నోటు పంచాయతీ తారాస్థాయికి చేరడం.. ఈ నియోజకవర్గం నుంచి ప్యారాచూట్ నేత కేఎల్‌ఆర్‌ను అధిష్ఠానం ప్రకటించడంతో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడ్డాయి. నేటికీ నియోజకవర్గంలో మంటలు చల్లారడం లేదు. ఈ క్రమంలోనే డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహా రెడ్డి కేఎల్‌ఆర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. చిగురింత పారిజాత నరసింహారెడ్డి దంపతులు మాత్రం అభ్యర్థిని ప్రకటించడంతోనే అయిపోలేదని, పార్టీ బీ ఫాం తనదేనంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఏకంగా ఢిల్లీలోనే మకాం వేసి బీ-ఫాం దక్కించుకునేలా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో శనివారం ఏకంగా ఒక కార్పొరేటర్ చేత పారిజాత నామినేషన్ దాఖలు చేశారు. దీంతో పార్టీ క్యాడర్‌లో అమోమయ పరిస్థితులు నెలకొన్నాయి. అధిష్ఠానం కేఎల్‌ఆర్‌ను అభ్యర్థిగా ప్రకటిస్తే.. పారిజాత నామినేషన్ వేయడంపై విస్తృతంగా క్యాడర్ చర్చించుకుంటున్నారు. ఒక వైపు ఐటీ రైడ్స్, మరోవైపు పార్టీలో సమన్వయం లేమి.. అధిష్ఠానం పట్టించుకోకపోవడంతో క్యాడర్ ఆలోచనలో పడగా.. ఇందులో కొందరు పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు చర్చ జరుగుతున్నది.



ఉప్పల్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరిన వారితో ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

## ఉప్పల్ బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు

### గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, నవంబర్ 4: సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణకు బంగారు భవిష్యత్తు ఉంటుందని బలంగా నమ్ముతూ, ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్ పార్టీలోకి భారీగా చేరుతున్నారు. శనివారం సైనిక్‌పురిలోని బీఎల్‌ఆర్ కార్యాలయంలో ఉప్పల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఉప్పల్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ అరటికాయల భాస్కర్ ఆధ్వర్యంలో శ్రీరామకాలనీ నుంచి వంద మంది, లక్ష్మీనారాయణ కాలనీ నుంచి వంద మంది, మాజీ కార్పొరేటర్ సుగుణ దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్యనగర్‌కాలనీ నుంచి 50 మంది మహిళలు, యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనగర్‌కాలనీ నుంచి మస్తాన్ ఫిరోజ్, జారనీ బాషా, మిరావలి, నరేశ్, చిన్న, సాయిరాం, ప్రసాద్, సందీప్, ప్రదీప్, మనోహర్, కిశోర్, నరేందర్, సాయికిరణ్, నవీన్, ప్రవీణ్, నగేశ్, సంతోష్, మహేందర్, రాకేశ్, వినయ్, శ్రీరామకాలనీ నుంచి బీఆర్‌ఎస్ ఫౌండర్ అనితారెడ్డి, రాజ్యలక్ష్మి, ప్రశాంతి, స్వప్న, సుకన్య, జయ, సుజాత, సరోజ, లక్ష్మి, సుగుబాయ్, సంధ్య, స్వాతి, సత్యనగర్ కాలనీ నుంచి లింగం, వెంకటేశ్, కృష్ణమోహన్ నేత, సత్యనారాయణ, యాదగిరి చారి, వెంకటేశ్, యాకస్వామి, సురేశ్, శివ, దేవరాజు, కరుణాకర్‌రాజు, నాగయ్య, వెంకటేశ్వర్లు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన బోయిగూడకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు

## బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

బన్సీలాల్‌పేట్, నవంబర్ 4 : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పనితీరు, సనత్‌నగర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని పద్మారావునగర్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి జీ.పవన్‌కుమార్ గౌడ్ అన్నారు. న్యూబోయిగూడలోని కీస్ బ్లాక్స్ అధ్యక్షుడు పి.సుధాకర్, కార్యదర్శి ఎం.విజయ్ ఆధ్వర్యంలో 15 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు, యువకులు పద్మారావునగర్‌లోని ఎన్నికల కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, నాయకులు తలసాని మహేశ్ యాదవ్, ఏసూరి మహేశ్, ఎం.మహేందర్, ఏనుగు పుశ్వంత్‌రెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నేతలు

## బీఆర్‌ఎస్‌తోనే సుపరిపాలన సాధ్యం

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 4 : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే సుపరిపాలన సాధ్యమని.. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో బీజేపీ దళిత మోర్చ అధ్యక్షుడు బచ్చలి కమల్, యువ మోర్చ నాయకుడు ఉదయ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బచ్చలి రాఖేశ్‌తోపాటు 50మంది యువకులు బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేండ్లలో రాష్ట్రం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధిని సాధించిందని, దేశంలో ఎక్కడాలేని విధంగా పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. కాలనీలు, బస్తీల్లో జరిగిన అభివృద్ధి ప్రజలకు కండ్లముందే కనబడుతుందని, ప్రతిపక్షాలు చేసే ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ప్రజలందరినీ బీఆర్‌ఎస్‌కు ఓటేసేలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీశ్ అరోరా, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, విష్ణు తదితరులున్నారు.